క్లుప్తంగా

ఆత్మవిశ్వాసం పెంపొందించాలి



శిక్షణలో చిన్నారులతో మాస్టర్ శర్మ తదితరులు

మంచాల: పిల్లల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించాలని మాస్టర్ గౌరవ్ శర్మ అన్నారు. బుధవారం మండలంలోని జాపాల గ్రామంలో స్ట్రీట్ కాజ్– జీఎస్‌ఐ ఆధ్వర్యంలో చిన్నారులకు సెల్ఫ్– డిఫెన్స్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ.. క్లిష్ట పరిస్థితుల్లో తమను తాము ఎలా రక్షించుకోవాలో పిల్లలకు నేర్పించాలని సూచించారు. వ్యక్తిగత భద్రతకు అవసరమైన పరిజ్ఞానం, నైపుణ్యాలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యోగా గురువు సింగారం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు జీవనోపాధి



దంపతులకు టీస్టాల్‌ను అప్పగించిన సభ్యులు

ఆమనగల్లు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరుపేద దంపతులు కృష్ణయ్య, పెద్దమ్మలకు బుధవారం స్వామి వివేకానంద సేవాబృందం ఆధ్వర్యంలో 'ఆర్ట్ ఆఫ్ గివింగ్' పేరుతో టీ స్టాల్ ఏర్పాటు చేసి, వారికి జీవనోపాధి కల్పించారు. నైబర్‌గుడ్ నినాదంతో ప్రొఫెసర్ అచ్యుత్ సమంత పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా సేవాబృందం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సేవాబృందం రాష్ట్ర కో– ఆర్డినేటర్ శివకుమార్, సభ్యులు సాయికుమార్ పాల్గొన్నారు.

బీసీ సేన గ్రామ కమిటీల ఏర్పాటు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరసముద్రం, లచ్చంపేట గ్రామాల్లో బుధవారం బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు ప్యాట జయ ఆధ్వర్యంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీరసముద్రం గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా జానంపేట యాదమ్మ, ఉపాధ్యక్షురాలిగా పి.యాదమ్మ, ప్రధాన కార్యదర్శిగా కవిత, కార్యదర్శిగా టి.యాదమ్మ, కోశాధికారిగా మంజుల ఎన్నికయ్యారు. లచ్చంపేట గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా వెంకటమ్మ, ఉపాధ్యక్షురాలిగా బిషాషా, ప్రధాన కార్యదర్శిగా మనీల, కోశాధికారిగా వీరమణి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పస్పుల ప్రశాంత్, నాయకులు జూపల్లి చంద్రశేఖర్, వెంకటేశ్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

ప్రాచీన కళలను కాపాడుకుందాం



సత్యహరిశ్చంద్రుడి పాత్రలో కళాకారుడు

షాద్‌నగర్‌రూరల్: ప్రాచీన కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బీజేపీ సిక్కిం రాష్ట్ర పరిశీలకుడు పాపన్నగౌడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రామేశ్వరంలోని ఉత్తర రామలింగేశ్వస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి రంగక్షేత్ర హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పాలమూరు వారి నిర్వహణలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ, చలనచిత్ర అభివృద్ధి సంస్థ సంయుక్త సౌజన్యంతో 'సత్యహరిశ్చంద్రీయం' అనే పౌరాణిక, పద్య నాటక ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ మాట్లాడుతూ.. ప్రాచీన కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజల మానసిక వికాసానికి, వినోదానికి కళా ప్రదర్శనలు ఎంతగానో దోహద పడతాయన్నారు. అనంతరం నాటక, పద్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, జేఎస్పీ.శివప్రసాద్, ద్రోణాచారి, యాదగిరిచారి, కృష్ణ, వీరమణి, పురుషోత్తమచారి, సంజీవరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు


షాబాద్: రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో ప్రభుత్వం ద్వారా మంజూరైనా 31 ఇందిరమ్మ ఇళ్లకు కొలతలు చేసి ముగ్గులు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, గ్రామస్తులు గోపాల్‌రెడ్డి, కృష్ణ, రాజు తదితరులు ఉన్నారు.

ధాన్యం.. దయనీయం

రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంట చేతికి వచ్చినప్పటికీ.. ధాన్యం విక్రయించుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం.. మద్దతు ధరతో పాటు బోనస్ ఇస్తున్న నేపథ్యంలో దళారులను ఆశ్రయించలేక.. కొనుగోలు కేంద్రాల్లో ప్రక్రియ ముందుకు సాగక పడిగాపులు కాస్తున్నారు.



లోయపల్లి మార్కెట్ వద్ద ధాన్యం కుప్పలు



బోడకొండలో.. వరి కుప్పలు

కదలని కొనుగోళ్లు
- కేంద్రాల వద్ద అన్నదాతల పడిగాపులు
- వరుణుడి ఉరుములతో రైతుల ఆందోళన

మంచాల: మంచాల మండలం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఇక్కడి ప్రజలు సాగుతో పాటు పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కాగా.. రైతులు సాగు మొదలు పంట చేతికి వచ్చే వరకు రేయింబవళ్లు చెమటోడుస్తుంటారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని చివరకు పంటలు పండిస్తున్నారు. తీరా దిగుబడి చేతికి వచ్చాక.. ధాన్యం విక్రయించుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. అయినప్పటికీ.. రైతు సంక్షేమ ప్రభుత్వాలు అని చెప్పుకునే అధికార యంత్రాంగం, నాయకులు చివరకు అన్నదాతల కష్టాలు పట్టించుకోవడం కర్షకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రైతన్నల సంక్షేమం కోసమే ప్రభుత్వం.. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని చెబుతున్నప్పటికీ.. వాటి నిర్వహణ తీరును పట్టించుకోవడం లేదు. రోజుల కొద్దీ కేంద్రాల వద్ద పడిగాపులు కాసినా.. ప్రక్రియ ముందుకు సాగక.. దళారులను ఆశ్రయించి నష్టపోతున్నామని పేర్కంటున్నారు. మద్దతు ధరతో పాటు బోనస్ కోల్పోతున్నామని ఆందోళన చెందుతున్నారు. సుమారు 60శాతం వరి ప్రైవేట్ వ్యక్తుల చేతికి వెళ్తున్నప్పటికీ.. మిగతాది కొనేందుకు ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శిస్తున్నారు.

నిర్వాహకుల ఇష్టానుసారం..

మండలంలో గత నెల 22న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో రైతులు.. కేంద్రాలకు ధాన్యం తెచ్చారు. కానీ ప్రక్రియను ఈ నెల 3న ప్రారంభించారు. తొలుత కూలీల కొరత ఉందని ఆలస్యం చేసినప్పటికీ.. ఇప్పటికీ కొనుగోళ్లు ఊపందుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటి వరకు 27 మంది రైతుల నుంచి 3,785 బ్యాగులు (15.14 మెట్రిక్ టన్నుల సన్న వడ్లు), దొడ్డు రకం 8 మంది రైతుల నుంచి 809 బ్యాగులు (3.23 మెట్రిక్ టన్నులు) కొనుగోలు చేశారు. బోడకొండ, లోయపల్లి గ్రామాల్లో 78 మంది రైతుల నుంచి 7647 బ్యాగుల (305.88 మెట్రిక్ టన్నులు) ధాన్యం సేకరించారు. సాధారణంగా తేమ శాతం 17 శాతం రావాలి. ఇక్కడ 14 శాతం వచ్చినా సకాలంలో కొనుగోలు చేయడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. కొనుగోలు విషయంలో ముందు వచ్చిన వారిని కాదని, వెనుక వచ్చిన వారివి కొనుగోలు చేస్తున్నారని, ఇష్టానుసారంగా వ్యవహరించి రైతులను నిర్వాహకులు నష్ట పరుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఓ వైపు కొనుగోలు కాక.. మరో వైపు వరుణుడి భయంతో ఇబ్బంది పడుతున్నామని కర్షకులు పేర్కొంటున్నారు.

సీరియల్ ప్రకారం..



మాకు 300 బస్తాల వరి ధాన్యం పండింది. విక్రయించడానికి మార్కెట్ తేస్తే రోజుల తరబడిగా కొనుగోలు చేయడం లేదు. రాత్రిపూట అడవి పందులు ధాన్యం కుప్పలను అల్లకల్లోలం చేస్తున్నాయి. వాటిపై కప్పిన కవర్లను చింపేస్తున్నాయి. సీరియల్ ప్రకారం కొనుగోలు చేసేలా చూడాలి.

– రమావత్ శారధ, రైతు, కొర్రంతండా

పక్షం రోజులుగా..



మాకు 350 బస్తాల ధాన్యం పండింది. పదిహేను రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చాను. నాటి నుంచి కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నాం. వానలతో ధాన్యం తడిసి పాడై పోతుంది. రైతులను పట్టించుకునే నాథుడే లేడు. అధికారులు స్పందించి తక్షణమే వడ్లను కొనుగోలు చేయాలి.

– తార్యనాయక్, రైతు, కొర్రంతండా

కొనుగోలు చేస్తున్నాం

ధాన్యం కొనుగోలు విషయంలో సాధ్యమైనంత వరకు రైతులకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నాం. బోడకొండ గ్రామంలో కొన్ని రోజులు కొనుగోలు చేశాం. ప్రస్తుతం లోయపల్లి గ్రామంలో ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి గింజ కొనుగోలు చేస్తాం. అన్నదాతలు ఆందోళన చెందవద్దు.

– రామకృష్ణరాజ్, డీసీఎంఎస్, మేనేజర్

దళారులను ఆశ్రయించవద్దు



తుర్కయంజాల్: రైతులతో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య



ఆమనగల్లు: రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ శోభారాణి

- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించండి: డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: రైతులు దళాలను ఆశ్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. రూ.500 బోనస్ పొందాలని సూచించారు. బుధవారం ఆయన పురపాలక సంఘం పరిధి తొర్రూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలి

ఆమనగల్లు: రైతులు.. ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి, తేమశాతం 15 నుంచి 16 ఉండేలా చూడాలని ఆమనగల్లు వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ ఏడీ శోభారాణి అన్నారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఏడీఏ మాట్లాడారు. దళారులను ఆశ్రయించకుండా.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు అందుబాటులో టార్పాలిన్ కవర్లు ఉంచాలని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డికి సూచించారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి అరుణకుమారి, ఏఈఓలు శ్రీనాథ్, మీనాక్షి, నిఖిత పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రైతులకు భోజనం వడ్డిస్తున్న నాయకులు

ఆమనగల్లు: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ ఆమనగల్లు మండలం మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు అన్నారు. బుధవారం వ్యవసాయ మార్కెట్‌యార్డులోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమంలో రైతులకు భోజనం వడ్డించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. మద్దతు ధరతో పాటు సన్నాలకు రూ.500 బోనస్ పొందాలని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సూపర్ వైజర్ రాజ్యలక్ష్మి, సిబ్బంది వినోద్, శరత్, రాములు, కిరణ్, శంకర్, కాంగ్రెస్ నాయకులు కండె సాయి, పర్వతాలు, విజేందర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు పారదు.. దుర్గంధం వీడదు



కాటమయ్యగడ్డ సమీపంలో మురుగు కాల్వ

మాడ్గుల: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మురుగు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి వ్యర్థ జలాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా వెలువడుతున్న తీవ్ర దుర్వాసనతో ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మాడ్గుల నుంచి కలకొండకు వెళ్లే మార్గమధ్యలో కాటమయ్యగడ్డ సమీపాన మురుగు కాల్వ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తతో నిండిపోయింది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ దోమలకు నిలయంగా మారింది. అయినప్పటికీ.. కాల్వల్లో పూడికతీత గురించి సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదని స్థానికులు ఆరోపించారు. వర్షాలు కురిసినప్పుడు ఇళ్ల మధ్య మురుగు పారుతుందని పేర్కొంటున్నారు. ఇదే విషయమై పలుమార్లు వివరిస్తూ.. మురుగు కాల్వను అండర్ డ్రైనేజీగా నిర్మించాలని పాలకులు, అధికారులకు విన్నవించామని తెలిపారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో బుధవారం డ్రైనేజీ పైపులైను పనులను ఆమె ప్రారంభించారు. మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.5లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. అన్ని వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, నర్సింలుగౌడ్, సోమ్లానాయక్, నాయకులు దేవేందర్‌యాదవ్, జనార్దన్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

పంట మార్పిడితో అధిక లాభాలు

మొయినాబాద్‌రూరల్: రైతులు పంట మార్పిడితో అధిక లాభాలు పొందవచ్చని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ చిరంజీవి, ఆలీబాబా అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నమంగళారంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రైతులు ఒకేరకమైన పంటలు సాగుచేయడం ద్వారా ఆ పంట మొక్కలకు అవసరమైన పోషకాలు తక్కువవుతాయని, రోగకారక పురుగుల ఉధృతి పెరిగి దిగుబడి తగ్గుతుందన్నారు. రైతులు ఒకే రకమైన పంటల సాగుకు పూర్తిగా స్వస్తి పలికి, పంటల మార్పిడికి శ్రీకారం చుట్టాలన్నారు.

కేసీఆర్ పాలనలో రైతులు సుభిక్షం

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, బాలరాజ్ తదితరులు

కడ్తాల్: పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారని, రాజులుగా బతికారని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధి ఎక్వాయిపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అచ్చంపేట్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్‌తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలినాళ్లలో కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలను సంతృప్తి పరుస్తూ పరిపాలన సాగించిందని, రైతుబంధు పథకం ద్వారా రైతుకు పెట్టుబడి సాయం అందిస్తూ అండగా నిలిచిందని గుర్తుచేశారు.

బీఆర్‌ఎస్ పథకాలకు మంగళం

రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన పథకాలకు మంగళం పాడే దిశగా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. రైతు భరోసా కింద రైతులకు రూ.22 వేల కోట్లు అందించాల్సి ఉండగా.. కేవలం మూడు, నాలుగు ఎకరాలతోనే సరిపెట్టి రూ.5 వేల కోట్లు మాత్రమే విడుదల చేసిందని పేర్కొన్నారు. రైతుబీమాతో ఎవరైనా రైతు మృతి చెందితే.. అతని కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేసియా అందించామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకు రైతు బీమా ప్రీమియం డబ్బులు చెల్లించలేదని విమర్శించారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతుల వివరాలు త్వరగా సేకరించి, ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం అందించి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జోగు వీరయ్య, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, నాయకులు భిక్షపతి, బాలయ్య, యాదయ్య, మహేశ్, వీరేశ్, వంశీయాదవ్, యాదయ్య తదితరులు ఉన్నారు.

సాగులో మెలకువలు తప్పనిసరి



సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి తదితరులు

- కాలానుగుణంగా పంటలు వేయాలి
- పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి

మంచాల: సాగులో రైతులు మెలకువలు తప్పనిసరిగా నేర్చుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ వెదెరె హన్మంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నోముల గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్ర వేత్త' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలానుగుణంగా సాగుపై రైతులకు అవగాహన ఉండాలని సూచించారు. ఎప్పుడు ఏఏ రకమైన పంటలు వేయాలనేది తెలుసుకోవాలన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను పండించడం వలన అధికలాభాలు గడించే అవకాశం ఉందని, సాగుతో పాటు పంట మార్పిడి చాలా ముఖ్యమని పేర్కొన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి, నేలలో ఉన్న పోషకాల గురించి తెలుసుకోవాలని, తదనుగుణంగానే పంటల సాగు చేయాలని చెప్పారు. తక్కువ రసాయనాలు, తక్కువ నీటితో పంటలను సాగు చేసే విధంగా కృషి చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినా రశీదు తప్పక తీసుకొని, భద్రపర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్ర వేత్తలు రాంప్రకాశ్, పద్మజ, మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ సుజాత, మండల వ్యవసాయ అధికారి కృష్ణమోహన్, ఏఈఓలు నిఖిత, లింగ స్వామి, సాయి వాణి, పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్: దాతల సహాయంతో పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి కొత్తూరు మండలం తీగాపూర్ శివారు బింజుసారియా ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ రూ.11లక్షల విరాళం ప్రకటించింది. పరిశ్రమ సిబ్బంది విరాళం చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. పరిశ్రమ యజమాని హితేశ్ కేడీయా ఉన్నారు.

కార్మికులకు అన్యాయం చేసిన కేంద్రం

- కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా చట్టాలు మార్పు
- సమ్మెను జయప్రదం చేయండి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్



ఇబ్రహీంపట్నం: మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

ఇబ్రహీంపట్నం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి, కార్మికులకు అన్యాయం చేసిందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ ఆరోపించారు. బుధవారం ఇబ్రహీంపట్నం వైల్డ్ గోల్డ్ పారిశ్రామిక ప్రాంతంలోని మోహక్ ఇంటర్నేషనల్ కంపెనీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 135 సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాన్ని, 12 గంటలకు పెంచి, కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్పు చేయడం కార్మికులకు ద్రోహం చేయడమేనని విమర్శించారు. ఈ చట్టాలను అడ్డం పెట్టుకొని కంపెనీల యజమాన్యాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపదను పెంచేది కార్మికులేనని పేర్కొన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, బ్యాంకు ఫెడరేషన్లు ఏకమై కేంద్రం తెచ్చిన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామని, సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీశ్, జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, ఎల్లేష్, పి.కృష్ణ, వీరేశం, శాంతమ్మ, పద్మ, బాలమణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

కడ్తాల్: అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కమిటీ కన్వీనర్ జిల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు. బుధవారం సమ్మె వాల్‌పోస్టర్‌ను కార్మిక, ప్రజాసంఘాల నాయకులతో కలిసి మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పలు కార్మిక చట్టాలను, నాలుగు కోడ్‌లుగా మార్చి, కార్మికుల హక్కులు కాలరాస్తుందని ఆరోపించారు. వెంటనే ఆ చట్టాలను పునరుద్ధరించి, కార్మికుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రాఘవేందర్, ఆటోయూనియన్ అధ్యక్షుడు మల్లేశ్, హమాలీ సంఘం అధ్యక్షుడు రమేశ్, నాయకులు శ్రీను, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



అంగడిబజార్‌లో కురుస్తున్న వర్షం

ఆమనగల్లులో భారీ వర్షం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో బుధవారం రాత్రి సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో పగలంతా ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. కాగా వర్షంతో హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారితో పాటు పలు కాలనీల్లో వరద నీరు నిలిచి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులోని ధాన్యం కుప్పలు తడిసిపోయాయి.



జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీరు